## అమెరికా పౌరసత్వం

# వదులుకోవడం ఎలా?

**2010 నుంచి పెరుగుతున్న తిరుగుప్రయాణాలు.. 1998లో 398 మంది.. 2017 నాటికి 6800కి పెరిగిన సంఖ్య**





ప్రసాద్ తోటకూర

వివిధ దేశాల నుంచి వచ్చి అమెరికాలో స్థిరపడి, అమెరికా పౌరసత్వం పొందినవారు లేదా అమెరికాలో జన్మించడం ద్వారా అమెరికా పౌరసత్వం పొందినవారు వివిధ కారణాల వల్ల పౌరసత్వాన్ని వదులుకోవాలనుకుంటున్నారు. ముఖ్యంగా 2010లో అమెరికా ప్రభుత్వం చేసిన 'ఫారిన్ అకౌంట్ టాక్స్ కంప్లయన్స్ యాక్ట్' వల్ల ఇలా పౌరసత్వాన్ని వదులుకుని తమతమ దేశాలకు వెళ్తున్నవారి సంఖ్య విపరీతంగా పెరుగుతూ వచ్చింది. ఉదాహరణకు 1998లో కేవలం 398 మంది మాత్రమే తాము పొందిన అమెరికా పౌరసత్వాన్ని వదులుకోగా, 2017 నాటికి ఈ సంఖ్య 6,800కి పెరిగింది. అయితే, పౌరసత్వాన్ని వదులుకోవడం వల్ల.. చాలా ప్రయోజనాలను కోల్పోతారని గమనించాలి. అలాంటి పరిస్థితి ఏర్పడినప్పుడు బాగా ఆలోచించిన తర్వాత మాత్రమే తగునిర్ణయం తీసుకోవాలి.

### పౌరసత్వం వల్ల లాభాలు..

అమెరికా దేశపు పౌరసత్వం ఉంటే.. చట్టసభ ఎన్నికల్లో ఓటు వేయవచ్చు. దేశఅధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు తప్ప దేనికైనా పోటీ చేయవచ్చు. (ఈ రెండు పదవులకు పోటీచేయాలంటే అమెరికా దేశంలో పుట్టిన పౌరులై ఉండాలి).

- అమెరికా కేంద్ర ప్రభుత్వ సంబంధిత సంస్థల్లో ఏ ఉద్యోగం చేయడానికైనా అర్హులు.
- అమెరికా పౌరసత్వం కలిగి ఉండి ప్రపంచంలో ఎక్కడ స్థిర నివాసం ఏర్పరచుకున్నా, అమెరికా నుంచి తమకు రావలసిన పెన్షన్, సోషల్ సెక్యూరిటీ ప్రయోజనాలను పొందవచ్చు. అదే సమయంలో నిబంధనల ప్రకారం ప్రతి సంవత్సరం ఆదాయపు పన్ను తప్పనిసరిగా చెల్లించవలసి ఉంటుంది.
- అమెరికాలో ఏ విద్యా సంస్థల్లో చదువుతున్నా, ఆ విద్యా సంబంధిత ఖర్చులకై కేంద్ర ప్రభుత్వం నుండి ధనసహాయం పొందే ప్రక్రియలో పౌరసత్వం ఉన్నవారికి ప్రాధాన్యం లభిస్తుంది.

### పౌరసత్వం వదులుకునే విధివిధానాలు

పద్నాలుగు సంవత్సరాల వయసు దాటి, అమెరికా పౌరసత్వం ఉన్న భారతీయులు దాన్నివదులుకోవాలంటే ముందుగా భారత పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకొని, ఆ భారత పాస్‌పోర్టు పొంది ఉండాలి.

### వదులుకునే ముందు భారత పాస్‌పోర్టు..

పీవోఐ.. అంటే పర్సన్ ఆఫ్ ఇండియన్ ఆరిజిన్ కార్డు కల్గిన వారైతే వారు గత ఏడు సంవత్సరాల కాలంలో భారతదేశంలో నివసించి ఉండాలి. అందునా దరఖాస్తు చేసుకునే నాటికి కనీసం ఒక సంవత్సరం పాటు నిరాటంకంగా భారతదేశంలో నివసించిఉండాలి

ఓసీఐ.. అంటే ఓవర్ సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా గుర్తింపు కలిగినవారు భారత పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకొనే నాటికి ఓసీఐ కార్డు పొంది 5 సంవత్సరాల కాలం గడిచిఉండాలి. అలాగే.. దరఖాస్తు చేసుకొనే నాటికి కనీసం 1 సంవత్సరం పాటు నిరాటంకంగా భారతదేశంలో నివసించిఉండాలి

### అమెరికా పౌరసత్వం వదులుకోవడానికి కావాల్సిన సమాచారం..

- భారతదేశంలోని ప్రస్తుత చిరునామా, ఫోన్, ఈమెయిల్ అడ్రస్
- అమెరికా పాస్ పోర్టులో ఉన్న పూర్తి పేరు
- గతంలో ఇతర పేర్లు వాడి ఉంటే, ఆ పేర్లు
- పూర్తి చేసిన డీఎస్-4080 దరఖాస్తు (సంతకం పెట్టకుండా)
- పూర్తి చేసిన డీఎస్-4081 దరఖాస్తు (సంతకం పెట్టకుండా)
- అమెరికా పౌరసత్వం పొందిన విధానం గురించి వివరాలు
- పుట్టిన తేదీ, వివరాలు
- అమెరికా పాస్ పోర్టు నంబర్
- సోషల్ సెక్యూరిటీ నంబర్
- అమెరికాలో గతంలో ఉన్న చిరునామా
- ఇతర జాతీయత
- ఆ జాతీయతకు సంబంధించిన పాస్ పోర్టు
- ఆ జాతీయత పొందిన తేది
- ఆ జాతీయత పొందిన విధానం
- అమెరికాలో గతంలో నివసించిన తేదీలు, కాల పరిమితులు



### పూర్తి చేయాల్సిన దరఖాస్తులు.. ఇతర వివరాలు

- డీఎస్-4079
- డీఎస్-4080(సంతకం చేయకుండా)
- డీఎస్-4081(సంతకం చేయకుండా)

చెల్లించాల్సిన రుసుము

ఈ దరఖాస్తులతో పాటు 2,350 డాలర్ల రుసుమును డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా అమెరికన్ కాన్సులేట్ కార్యాలయానికి చెల్లించవలసి ఉంటుంది.

- భారతదేశంలో ఉన్న సంబంధిత అమెరికన్ కాన్సులేట్ కార్యాలయంలో అపాయింట్‌మెంట్ తీసుకోవడానికి ఈ మెయిల్ చేయాలి. ఆ వివరాలు..

న్యూఢిల్లీ: acsnd@state.gov
చెన్నై: chennaics@state.gov
హైదరాబాద్: hydacs@state.gov
ముంబై: mumbaiacs@state.gov
కోల్‌కత్తా: kolkataacs@state.-gov

- ఈమెయిల్ చేశాక నిర్ణీత సమయానికి అమెరికన్ కాన్సులేట్ అధికారుల ముందు హాజరై ఆ దేశ పౌరసత్వాన్ని వదులుకుంటున్నట్టుగా ప్రకటించవలసి ఉంటుంది.
- ఈ ప్రక్రియలో చివరి ఘట్టం.. అమెరికాలో ఉన్న ఆదాయ పన్ను (ఐఆర్ఎస్) శాఖకు ఫారం-8854 నింపి పంపాలి.